యథేచ్ఛగా కొండలు తవ్వేస్తున్నారు..!


తరలించేందుకు సిద్ధం చేసిన రాయి

- అక్రమంగా రాయి, గ్రావెల్ తరలింపు
- జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడలో రెచ్చిపోతున్న అక్రమార్కులు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, మైనింగ్ అధికారులు


రాయి తరలించేందుకు సిద్ధంగా ఉన్న మినీ లారీ

కొమ్మాది: కూర్చుని తింటే కొండలైనా కరిగిపోతాయి అని అలనాటి నానుడి. ఇప్పుడు కూర్చుని తవ్వేస్తుంటే కొండలు కరిగిపోతున్నాయి. కొందరు అక్రమార్కులు రాత్రి, పగలు అనే తేడా లేకుండా కొండలను పిండి చేసి యథేచ్ఛగా గ్రావెల్, రాయి తరలించుకుపోతున్నారు. దీంతో రోజురోజుకూ కొండలు తరిగిపోతున్నాయి. ఇదంతా జరుగుతున్నది ఏ మారుమూల గ్రామమో కాదు... జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ ఎస్సీ కాలనీ సమీపంలోనూ, కళాగ్రామం సమీపంలోనూ కొండల వద్ద కొందరు చక్కగా రాయిని తరలించి వ్యాపారం చేసుకుంటున్నారు. ఇదంతా కె.నగరపాలెం, కాపులుప్పాడ సచివాలయ సమీపంలో జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు కలుగుతున్నాయి.

పగలు అలా... రాత్రిళ్లు ఇలా...

స్థానికంగా పగలంతా మనుషులను పెట్టి కొండలను తవ్వించి రాళ్లన్నీ ఒక దగ్గరకు చేర్చి లారీల్లో, మినీ ట్రక్కుల్లో తరలిస్తున్నారు. రాత్రి సమయాల్లో మాత్రం ఏకంగా మిషన్లు పెట్టి కొండను తవ్వేస్తున్నారు. అయినప్పటికీ రెవెన్యూ, మైనింగ్ అధికారులు మాత్రం ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. రోజుకు లక్షలాది రూపాయల వ్యాపారం జరుగుతున్నా, అధికారుల కళ్లుగప్పి కొండలు తవ్వేస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ అక్రమాలపై ఇటు రెవెన్యూ అధికారులు, మైనింగ్ అధికారులు ఇప్పటి వరకు ఏ చర్యలూ తీసుకోకపోవడం గమనార్హం. ఇప్పటికే ఇక్కడి కొండల్లో సగ భాగం తరిగిపోయాయి. అక్కడక్కడ భారీ ఎత్తున రాళ్లు జారిపోతున్నాయి. ఇంకొన్నాళ్లు పోతే కొండలన్నీ మాయమైపోయినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఇప్పటికైనా రెవెన్యూ, మైనింగ్ అధికారులు సమన్వయంతో అక్రమ తవ్వకాలు, తరలింపుపై ఉక్కు పాదం మోపాలని పలువురు కోరుతున్నారు.


కనుచూపు మేర మట్టిని తరలించేసిన ప్రదేశం

సీఎం జగన్ పాలనపై ప్రజల్లో విశ్వాసం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: సీఎం జగన్ పాలనపై ప్రజలు పూర్తి విశ్వాసాన్ని ఉంచి మద్దతు తెలుపుతున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆయనకు మద్దతుగా కోటి మిస్డ్‌కాల్స్ పూర్తయిన సందర్భంగా ఆదివారం సాయంత్రం ఇక్కడి క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఇంటింటికీ తిరుగుతున్నారన్నారు. ఈ సందర్భంగా అందరూ తమకు అన్ని పథకాలు నేరుగా అందుతున్నాయని ఆనందంతో చెబుతున్నారన్నారు. ఇదే సందర్భంగా ఎవరైనా స్థానిక సమస్యలు చెబితే వాటిని జాప్యం చేయకుండా పరిష్కరిస్తున్నామన్నారు. ముఖ్యంగా గతంలో కేవలం ఎన్నికల సమయాల్లోనే ప్రజాప్రతినిధులు ఇళ్లకు తిరిగేవారని.. కానీ తొలిసారి ఇలా గడప గడపకు తిరుగుతుండడంపై ప్రజలు ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. అవినీతి, సిఫారసులు లేకుండా అర్హులందరికీ మేలు జరుగుండడమే వీరి ఆనందానికి కారణమన్నారు. చంద్రబాబు నాయుడు ఏనాడూ ప్రజలను పట్టించుకోలేదని, కనీసం ఇచ్చిన హామీలను కూడా అమలు చేయలేదని ఆరోపించారు. ఆయనకు మద్దతుగా ఉన్న పత్రికలు, మీడియా ఇష్టం వచ్చినట్టు తప్పుడు కథనాలు రాస్తున్నాయని, అయితే వాటిని ఎవరూ నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా మళ్లీ సీఎం జగన్ ఘన విజయం సాధించి రెండోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకులు పి.బాలరాజు మాట్లాడుతూ మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఎంతో దిగ్విజయంగా జరుగుతోందని, ఇది చాలా గొప్ప విషయమన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు బోని బంగారునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిని కాపాడాల్సింది యువతే


కాశీ విశ్వేశ్వరస్వామి


ప్రవచనాలు వినిపిస్తున్న పరమాత్మానందగిరి స్వామి


పద్మనాభం: భారతీయ సంస్కృతిని కాపాడాల్సిన బాధ్యత యువతదేనని గంగాపురం మళయాళస్వామి, లక్ష్మీ నారాయణ ఆశ్రమం పీఠాధిపతి పరమాత్మానంద గిరి స్వామి అన్నారు. మద్ది గ్రామంలోని లక్ష్మి నాయుడు కళ్లాల వద్ద ఉన్న దుర్గా కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రవచనాలు చేశారు. యువత పెడదారి పట్టకుండా సన్మార్గంలో పయనించాలని సూచించారు. భారతీయ సంస్కృతిని విదేశాల్లో చాటి చెప్పిన యువకుడు స్వామి వివేకానందుడన్నారు. ప్రజలు భక్తి భావాలను అలవరచుకున్నప్పుడే జ్ఞాన చైతన్యాన్ని కలిగి ఉంటారన్నారు. ధర్మం, సత్యం, న్యాయాన్ని ఆచరించిన పురుషోత్తముడు శ్రీరాముడన్నారు. ప్రతి ఒక్కరూ ఈ భావాలు కలిగి ఉండాలన్నారు. భగవంతుని పూజించినప్పుడే ఈ భావాలు అలవడతాయన్నారు. ఈ సందర్భంగా రంగస్థల నటుడు, మద్ది గ్రామానికి చెందిన సామవేదం బాల సుబ్రహ్మణ్యం(బాలు)తో పాటు పలువురుని ఆలయం తరపున పీఠాధిపతి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కనకల బంగారునాయుడు, ఆశ్రమాల పీఠాధిపతులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రథమ వార్షికోత్సవం

దుర్గా కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి దుర్గా కాశీ విశ్వేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హేరేరామ నామస్మరణ మార్మోగింది. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

వైభవంగా అష్టలక్ష్మి ఆలయ వార్షికోత్సవం


పూజలు అందుకున్న లక్ష్మీ నారాయణ స్వామి

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లో గల శ్రీ అష్ట లక్ష్మీ దేవాలయం 12వ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ మూర్తి, రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో వైశాఖ శుద్ధ తదియ అక్షయ తృతీయను పురస్కరించుకుని ఉదయం 5.30 గంటలకు సుప్రభాత సేవ, అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఉదయం 8 గంటల నుంచి విశ్వక్షేణ పూజలు, శ్రీ లక్ష్మీనారాయణ హోమం, సాయంత్రం విశేష సేవలు, శేష వాహనం, గరుడ వాహనం, పల్లకి సేవ, తిరువీధి ఉత్సవం, శ్రీ లక్ష్మీనారాయణులకు కల్యాణం జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధరస్వామి పూజలు చేశారు.

ఆలయాల్లో పూజలు


అష్ట లక్ష్మి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

మధురవాడ: అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకుని మధురవాడ పరిసర ప్రాంతాల్లోని వివిధ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధురవాడలోని అష్ట లక్ష్మి ఆలయంలో లక్ష్మీ నరసింహ స్వాములకు శ్రీనివాస శర్మ, అయోధ్యనగర్‌లోని విజయ దుర్గ మల్లికార్జున స్వామి ఆలయంలో కిరణ్ శర్మ ఆధ్వర్యంలో, ఇతర ఆలయాల్లో స్వాములు, అమ్మవార్లకు పంచామృత అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజలకు పరిసర ప్రాంతాల భక్తులు విశేషంగా హాజరై తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఆరిలోవ: యోగాతో ప్రతి మనిషికి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఆనంద్‌మార్గ్ ఆశ్రమం స్వామీజీ సామ్యానంద్ అవదూత తెలిపారు. ముడసర్లోవ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ వద్ద జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో ఆదివారం ఉచిత యోగా శిబిరం నిర్వహించారు. ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు జరిగిన ఈ శిబిరంలో వాకర్స్ క్లబ్ సభ్యులతో పాటు స్థానికులు వివిధ యోగాసనాలు నేర్చుకున్నారు. ఈ సందర్భంగా సామ్యానంద్ అవదూత మాట్లాడుతూ యోగాలో ఏ ఆసనం వల్ల ఎలాంటి ఉపయోగం కలుగుతుందో వివరించారు. ప్రస్తుతం వాతావరణంలో వచ్చిన మార్పులు, పరిస్థితుల కారణంగా మనిషికి కలుగుతున్న ఒత్తిడి, అనారోగ్యం కుదుటపడడానికి యోగా సాధన మంచి ఔషధం లాంటిదన్నారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు మూర్తి, సభ్యులు ఈశ్వరరావు, వీర్రాజు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో జ్ఞాన సముపార్జన


మాట్లాడుతున్న తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస తిరుమల విద్యాసంస్థల ఆవరణలో ఆదివారం 5, 6, 7, 8, 9, 10 తరగతులు పూర్తి చేసుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు నీట్, జేఈఈ అడ్వాన్స్‌డ్, మెయిన్స్ పరీక్షలకు సంబంధించి ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రతిభ కలిగి ఉంటాడని, వారికి సరైన విద్య, ప్రోత్సాహం అందిస్తే విజయాలకు చేరువ అవుతారన్నారు. మొబైల్ ఫోన్ వినియోగం వల్ల విద్యార్థులు చెడుమార్గం పట్టే ప్రమాదం ఉందన్నారు. దానికి బదులుగా పుస్తక పఠనం అలవాటు చేసుకోవడం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. డైరెక్టర్ సరోజినీదేవి మాట్లాడుతూ పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర ముఖ్యమన్నారు. వారికి నైతిక విలువలతో కూడిన విద్యను అందించడంలో విద్యాసంస్థలతో పాటు తల్లిదండ్రుల బాధ్యత ఉందన్నారు. సమావేశంలో డైరెక్టర్లు ఇ.మృత్యుంజయరావు, కె.ఎన్.వి.వి.సత్యనారాయణ, ఎం.సత్యనారాయణ, జి.సతీష్‌బాబు, తల్లిదండ్రుల కమిటీ నుంచి రుషి, స్వాతి తదితరులు మాట్లాడారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆనందపురం : మండలంలోని పలు గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మండల విద్యుత్ శాఖ ఏఈఈ సురేష్ కుమార్ తెలిపారు. కొత్త లైన్లు ఏర్పాటు చేయనున్న దృష్ట్యా పెద్దిపాలెం, బంటుబిల్లి వారి కళ్లాలు, చందక, గొట్టిపల్లి, కుసులువాడ గ్రామాలకు మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

వ్యక్తిత్వ వికాస తరగతులకు ఆహ్వానం

తగరపువలస: భీమిలిలోని యోగా విలేజ్ ఆధ్వర్యంలో వేసవి ప్రత్యేక తరగతుల్లో భాగంగా మే ఒకటి నుంచి 31 వరకు పిల్లలకు ఆన్‌లైన్‌లో వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించనున్నారు. ఉదయం 7.30 నుంచి 8.30 వరకు యోగా క్లాసులు, 10 నుంచి 10.30 వరకు భగవద్గీత, 10.30 నుంచి 11 వరకు నీతి కథలు, పద్యాలు బోధించనున్నారు. వివరాలకు 98496 66589, 87127 44702లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు. 50 మంది విద్యార్థుల పరిమితితో ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

అమ్మవార్లకు పసుపు, కుంకుమ సమర్పణకు ఏర్పాట్లు


ఎల్లారమ్మ, దుర్గాలమ్మ, కొత్తమ్మతల్లి

తగరపువలస: తగరపువలస, రామన్నపేట, శ్రీనగర్, బాలాజీనగర్, పాతలోకల్ ఆఫీసు వీధి, బైపాస్ రోడ్డు, బంగ్లామెట్ట, గాంధీబొమ్మ వీధి, వెంకటేశ్వర మెట్ట గ్రామాల ప్రజలు ఈ నెల 25న అమ్మవార్లకు పసుపు, కుంకుమ సమర్పించనున్నారు. ఉదయం 8 గంటల నుంచే నగరపువీధిలోని అమ్మవారి చదురు నుంచి మేళతాళాలు, కాంతారా డ్యాన్స్, కోలాటం, పులివేషాలు, డీజే, టపాసులు, డప్పులతో బయలుదేరి ఎల్లారమ్మ మెట్టపై ఎల్లారమ్మ, బంగ్లా మెట్టపై దుర్గాలమ్మ, కొండపేటలోని కొత్తమ్మతల్లికి మొక్కులు చెల్లించనున్నారు. ఈ మూడు ఆలయాల వద్ద భారీ ఎత్తున బాణసంచా ఏర్పాటు చేసినట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

నాట్య సామగ్రి పంపిణీ


కళాకారిణులకు వన్ గ్రామ్ గోల్డ్ నగలు అందజేస్తున్న ఎస్ఐ సునీత

మధురవాడ: కళల పరిరక్షణతోపాటు ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సునీత అన్నారు. చంద్రంపాలెంలోని వెన్నెలాస్ వోగ్ వార్షికోత్సవం, అక్షయ తృతీయను పురస్కరించుకుని సమకూర్చిన భరత నాట్యానికి ఉపయోగించే ఒన్ గ్రామ్ గోల్డ్ నగలు పేద కళాకారిణులకు ఆమె ఉచితంగా అందజేశారు. మధురవాడ పరిసర ప్రాంతాలకు చెందిన 20 మందికి ఒక్కొరికి సుమారు రూ.3 వేలు విలువ చేసే సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో కళలు కీలక పాత్ర పోషిస్తాయని, కళాకారిణులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పి.సౌమ్య పాల్గొన్నారు.

పెద్దిపాలెం వద్ద ఘోర ప్రమాదం


పెద్దిపాలెం ఆరు లైన్ల రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ధ్వంసమైన కార్లు

ఆనందపురం : మండలంలోని పెద్దిపాలెం ఆరు లైన్ల రహదారిపై ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అదృష్టవశాత్తు వాహన చోదకులు ప్రాణాపాయం నుంచి బయటపడగా, కార్లు ధ్వంసమయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. విశాఖ వైపు నుంచి తగరపువలస వైపు వెళ్తున్న కారు అకస్మాత్తుగా ఎడమ వైపు తిప్పగా దాని వెనుక నుంచి వెళ్తున్న మరో కారు డ్రైవర్ కంగారు పడి కారుని కుడి ఎడమ వైపులకు తిప్పి తప్పించుకొని వెళ్లిపోయాడు. దాని వెనుక వస్తున్న ఇంకొక కారు డ్రైవర్ ఈ సంఘటన చూసి కంగారుపడి కారుని అదుపు చేయలేక మొదట ఎడమ వైపు మళ్లిన కారునే వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. ఈ సంఘటనలో ముందున్న కారు గాల్లోకి లేచి డివైడర్‌పైకి దూసుకుపోయింది. ఢీకొన్న కారు రోడ్డు అంచున ఢీకొని నిలిచిపోయింది. కాగా ఈ సంఘటనలో కార్లుని నడుపుతున్న వారికి స్వల్ప గాయాలు కాగా ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. కార్లు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు.

ఐఐటీ, నీట్ పరీక్షలపై 'శశి'లో అవగాహన సదస్సు



మాట్లాడుతున్న శశి విద్యాసంస్థల వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ

తగరపువలస: సంగివలస శశి విద్యాసంస్థల ఆవరణలో ఆదివారం ఐఐటీ, నీట్ పరీక్షలపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ తమ విద్యాసంస్థల్లో చేర్పించిన విద్యార్థుల పూర్తి బాధ్యత తల్లిదండ్రుల నుంచి తాము తీసుకుంటామన్నారు. తాము చూపే వ్యక్తిగత శ్రద్ధ కారణంగా విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నారన్నారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెడుతూ ఏటా తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ మాట్లాడుతూ విశాఖలో అడుగుపెట్టిన తక్కువ వ్యవధిలోనే తమ విద్యార్థులు ఐఐటీ, నీట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించి తాము గర్వపడేలా చేస్తున్నారన్నారు. ఐఐటీ, జేఈఈ, నీట్‌లో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సునాయాసంగా సాధిస్తున్నారన్నారు. ఐఐటీలో 92, నీట్‌లో 35 మంది సీట్లు సాధించారన్నారు. ఈ సదస్సులో డైరెక్టర్ బూరుగుపల్లి రాధారాణి, కరస్పాండెంట్ మేకా క్రాంతి సుధ, ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలపై శిక్షణ

పద్మనాభం: పాఠశాలల్లో సామాజిక తనిఖీలపై ప్రధానోపాధ్యాయులకు రేవిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం శిక్షణ ఇవ్వనున్నట్టు ఇన్‌ఛార్జి ఎంఈవో ఎం.శివరాణి చెప్పారు. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభం కానున్న శిక్షణకు మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు హాజరు కావాలని ఆమె కోరారు.

ముగిసిన ఎంపీఎల్ క్రికెట్ లీగ్ పోటీలు

ట్రోఫీ విజేత చంద్రంపాలెం ఎస్ఎన్ టైగర్స్ జట్టు


ట్రోఫీతో విజేత చంద్రంపాలెం ఎస్ఎన్ టైగర్స్ జట్టు సభ్యులు

పీఎం పాలెం: మహానేత వైఎస్సార్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం బీ గ్రౌండ్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన విజ్జీస్ మధురవాడ ప్రీమియర్ లీగ్ విజేతగా చంద్రంపాలెం ఎస్ఎన్ టైగర్స్ నిలిచి టోర్నీ కప్, రూ.లక్ష ప్రైజ్ మనీ సొంతం చేసుకుంది. రన్నర్స్‌గా నిలిచిన బొట్టవానిపాలెం బీవీపీ బుల్స్ జట్టు ట్రోఫీ, రూ. 50 వేలు ప్రైజ్ మనీ అందుకుంది. ఈ నెల 15 నుంచి జరిగిన లీగ్ పోటీల్లో 8 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం సాయంత్రం బీ క్రికెట్ స్టేడియంలో లీగ్ ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. లీగ్ నిర్వహణలో ముఖ్య పాత్ర పోషించిన బైపిల్లి ప్రసాద్ పర్యవేక్షణలో విజేతలకు ట్రోఫీలు, వ్యక్తిగత ప్రైజులు అందజేశారు. బెస్ట్ బ్యాట్స్‌మేన్‌గా వాండ్రాసి భాస్కర్, బెస్ట్ బౌలర్‌గా సంతోష్ కుమార్, ఆల్ రౌండర్‌గా గణేష్ నిలిచారు. కార్యక్రమంలో రాష్ట్ర నగరాలు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిళ్లా సుజాత, కార్పొరేటర్ పి.మంగమ్మ, మధురవాడ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ ఎస్.శ్రీధర్, కనక మహాలక్ష్మి దేవస్థానం బోర్డు సభ్యులు వంకాయల మారుతీ ప్రసాద్, సింహాచలం దేవస్థానం సభ్యురాలు రాజేశ్వరి, మాధవివర్మ, స్థానిక నాయకులు పిళ్లా సత్యనారాయణ, పోతిన యల్లాజీ, వాండ్రాసి రవి, సోంపాత్రుడు, జగ్గుపిల్లి నరేష్, పొట్టి ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా సచిన్ జన్మదిన వేడుకలు

క్రికెట్ క్రీడాభిమానులు దేవునిగా ఆరాధించే ప్రఖ్యాత క్రీడాకారుడు సచిన్ తెండూల్కర్ 50వ జన్మదిన వేడుకలను మధురవాడ ప్రాంతంలోని క్రికెట్ అభిమానులు ఆదివారం సాయంత్రం ఘనంగా జరుపుకున్నారు. బీ క్రికెట్ గ్రౌండ్‌లో 50 కిలోల కేక్ కట్ చేశారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన


నృత్యం చేస్తున్న కళాకారులు

పీఎం పాలెం : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం శిల్పారామం (జాతర)లో ప్రదర్శించిన చిన్నారుల కూచిపూడి జానపద నృత్యాలు ప్రేక్షకులను ఆద్యంతం అలరించాయి. నగరంలోని సిద్ధేంద్ర నాట్యాలయంలో శిక్షణ పొందుతున్న బాల కళాకారులు కనువిందుగా నృత్యం చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కార్యక్రమం ముందుగా బ్రహ్మమొక్కటే కీర్తనతో ప్రారంభమయింది. కళాకారులు మౌనిక, సంజన, కుషాల్, కోమల్ చంద్, రాఘవ, భాషిత, అక్షర, కీర్తి, శిరీష, తనూజ, నృత్య దర్శకురాలు సి.మోహనలక్ష్మి పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

అధ్వానంగా సాయి ప్రియా గార్డెన్స్ రోడ్డు



తగరపువలస: జీవీఎంసీ మధురవాడ జోన్‌లోని సాయి ప్రియా గార్డెన్స్ రోడ్డు పాదచారులు, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా మారింది. ఈ మార్గంలో ఉన్న కనస్ట్రక్షన్ కంపెనీ కారణంగా డబుల్ రోడ్డు పొడవునా భవన నిర్మాణ మెటీరియల్, నీరు చేరడంతో బురదగా ఉంటోంది. చిన్న వాహనాలు ఈ రహదారిలో జారిపోతున్నాయి. జాతీయ రహదారిలోని మూడు గుడుల నుంచి బక్కన్నపాలెం వరకు ఇదే పరిస్థితి నెలకొంది. జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు ఈ డబుల్‌రోడ్డు శుభ్రత, భద్రతపై చర్యలు తీసుకోవాలి.
– జగన్నాథరావు, బక్కన్నపాలెం



